కబడ్డీ రాష్ట్ర జట్టు ఎంపిక

ప్రజాశక్తి-పాలకొండ

అండర్-18 రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టును ఆదివారం ఎంపిక చేశారు. పది రోజులుగా పాలకొండలో సి.ఎల్ నాయుడు కళ్యాణ మండపం ఆవరణలో 20 మంది కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. ఆదివారం కృషి యోగా కేంద్రం వద్ద 14 మందితో రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. ఈ నెల 24న ఢిల్లీలో పోటీ పడిన తర్వాత హరిద్వార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్ళనున్నారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వై.ప్రభావతి, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అర్జున్‌రావు పర్యవేక్షణలో ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పల్లా కొండలరావు, జిల్లా కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్, వెన్నపు శ్రీనివాస్‌రావు, సిఎల్ నాయుడు సంస్థల చైర్మన్ సి.ఎల్ నాయుడు, ఎంఇఒ సోంబాబు, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణ, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ జాబితాలో చేర్చేదెప్పుడు?

నాన్‌షెడ్యూల్డ్ జాబితాలో ఉన్న దుడ్డుఖల్లు గ్రామం

విజయనగరం, మన్యం జిల్లాలో ఎన్నో ఏళ్లుగా గిరిజనులు జీవనం సాగిస్తున్నా.. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు పొందలేకపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్‌కు అర్హత కోల్పోతున్నారు. ఇందుకు కారణం ఆ గ్రామాలు షెడ్యూల్డ్ జాబితాలో లేకపోవడమే గిరిజనులకు పెద్ద శాపంగా మారింది. గత వైసిపి హయాంలో 2014లో రాష్ట్రంలోని 39 మండలాల్లో 554 గ్రామాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చేందుకు గిరిజన సలహా మండలిలో తీర్మానం చేశారు. అయితే ఉమ్మడి జిల్లాలోనే 455 గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ గ్రామాలుగా ఉండగా, 179 గిరిజన గ్రామాలను మాత్రమే షెడ్యూల్ జాబితాలో చేర్చేందుకు ప్రతిపాదనలు పెట్టారు. గిరిజన సలహా మండలిలో ప్రతిపాదనలు పెట్టి పదేళ్లు గడుస్తున్నా నేటికీ గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చలేదు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చడానికి గిరిజన సలహా మండలి తీర్మానించి ఆమోదం చేయాలని గిరిజనులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

- **నాన్ షెడ్యూల్డ్ జాబితాలో 455 గ్రామాలు**
- **రిజర్వేషన్లకు దూరమైన గిరిజనులు**
- **ఎన్నాళ్లయినా పాలకులకు పట్టదా?**

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురం మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం మండలం నూటికి నూరు శాతం ఏజెన్సీ ప్రాంతం. అయినప్పటికీ దుడ్డుఖల్లు పంచాయతీ మాత్రం అందుకు భిన్నంగా నాన్ షెడ్యూల్డ్ పంచాయతీగానే పరిగణించబడింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఈ పంచాయతీలో నివసిస్తున్న గిరిజనులు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలకు రిజర్వేషన్లు కోల్పోతున్నారు. దుడ్డుఖల్లు పంచాయతీలో 15 గ్రామాలు ఉన్నాయి. వీటిలో కొత్తవలస, బెల్లిడి, దొరజమ్ము, కంబగూడ, దొర కేక్కువ, కొల్లిగూడ, లోవలక్ష్మీపురం, విశ్వనాథపురం, దుడ్డుఖల్లు, బుడ్డెంఖర్జ, మేదరగండ, పిల్లి గూడ, బొడ్లగూడ, చింతలపాడు గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ గ్రామాలుగానే పరిగణించబడుతున్నాయి. నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి అధికారులకు విన్నవించినా నేటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో పై గ్రామాల్లో నివసిస్తున్న వారు గిరిజనులుగా ఉన్న రిజర్వేషన్ల ప్రక్రియ వీడిదరి చేరడం లేదు. దీంతో చదువుకుని ఉన్న గిరిజన యువతీ, యువకులు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. గిరిజన రైతులకు ఎటువంటి వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందక ప్రతి ఏటా అప్పులు చేసి పంటలను పండిస్తున్నారు. పంటలకు నష్టం వాటిల్లిన ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం అందడం లేదు. పక్కా గృహాలు లేవు, తాగునీటి సమస్య వెంటాడుతుంది. 1/70చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం వీరికి వర్తించదు.

షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలి

దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండడంతో రాజ్యాంగం కల్పించిన హక్కులు గిరిజనులకు అందడం లేదు. జిఒ నెంబర్ 3, 1/70, పీసా చట్టాలు వర్తించవు. ప్రభుత్వ ఉద్యోగానికి రిజర్వేషన్ దూరమైంది. ఏళ్ల నాటి సమస్యను ప్రభుత్వం గుర్తించి షెడ్యూల్డ్ పరిధిలోకి తీసుకొస్తే యువత, మహిళలు, రైతుల అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

- పి.తిరుపతిరావు, సిపిఎం నాయకులు

ఉద్యోగ అవకాశాలు లేవు

మా గ్రామం నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండడంతో ఇక్కడ చదువుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు కోల్పోతున్నాం. నేను డిగ్రీ చదువుకున్న రిజర్వేషన్ లేక ఉద్యోగం రాక నిరుద్యోగిగా ఉన్నాను. ప్రభుత్వం స్పందించి మా గ్రామాన్ని షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలి.

- బిడ్డిక సంధ్యశ్రీ, గిరిజన యువతి, దుడ్డుఖల్లు గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

గిరిజనులకు తీవ్ర నష్టం

గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు వర్తించక తీవ్రంగా నష్ట పోతున్నారు. ఉమ్మడి జిల్లాలో అర్హత గల సుమారు 500 వరకు ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలుగా గుర్తించాలి. గతంలో మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఈ ప్రక్రియ జరిగింది. మన రాష్ట్రంలోనూ అలా జరిగేలా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కృషి చేయాలి. అప్పుడే భూమిపై గిరిజనులకు హక్కు వస్తుంది. ఉపాధి అవకాశం దొరుకుతుంది.

- పాలక రంజిత్‌కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి

తోలంగూడ రోడ్డు వద్ద గిరిజనులతో కలిసి నిరసన తెలియజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

గిరిజన గ్రామాలకు
రోడ్డు సౌకర్యం కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాలకు టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణమే రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని వబ్బంగి పంచాయతీలో గిరిశిఖర గ్రామాలైన తోలంగూడ, కోసంగూడ, కుంబిరికివలస, ఈనతగూడను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత 30 ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా ఏ ప్రభుత్వమూ ఇంతవరకు రోడ్డు వేయలేదని గిరిజనులు ఆయన ఎదుట వాపోయారు. వెంటనే గ్రామస్తులతో కలిసి తోలంగూడ మార్గం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని ఓట్లేసి గెలిపిస్తే, ఏడాది కావస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని చెప్పారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అటు పాడేరు ప్రాంతంలో, ఇటు సాలూరు ఏజెన్సీలో పర్యటించి, కొన్ని గ్రామాల రోడ్లు ప్రారంభించి, మొత్తం గిరిజన గ్రామాలకు రోడ్లు వేయిస్తానని హామీలు ఇచ్చారని, ఇంతవరకు అవేవీ నెరవేరలేదని తెలిపారు. గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ రోడ్లు లేక డోలిమోతలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజనులు అటవీ ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాలన్నా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. గిరిజనుల పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని వాపోయారు. రాజధాని అమరావతిలో వేల కోట్ల రూపాయలు పెట్టి యుద్ధ ప్రాతిపదికన రోడ్లు వేసి అభివృద్ధి చేస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలకు మాత్రం రోడ్లు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. అంటే అమరావతిలో తిరిగిన వారు విలువైన వారా? గిరిజనుల కారా? అని ప్రశ్నించారు. పెత్తందారులున్న గ్రామాలకు మాత్రం ఒకే గ్రామానికి రెండేసి రోడ్లు వేస్తున్నారని, గిరిజనులను చులకనగా చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు వెయ్యకపోతే దశలవారీ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్‌కి గతంలో వినతులు ఇచ్చామని, ఇక మెమోరాండాలు ఇవ్వడం కుదరదని, గిరిజనులు పోరాటాలకు సిద్ధమవుతున్నారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎం.అడ్డమేశ్వరరావు, బిడ్డిక భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

క్షణక్షణం.. భయం భయం

3 రోజులుగా రేగులగూడలో ఏనుగుల తిష్ట

రేగులగూడ తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని రేగులగూడ గ్రామస్తులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. రాత్రయితే క్షణక్షణం భయం భయంగా గడుపుతున్నారు. పొలాలకూ వెళ్లడం మానేశారు. ఎటువైపు నుంచి ఏనుగుల గుంపు గ్రామంపై పడుతుందోననే ఆందోళన వెంటాడుతోంది. మండలంలో రేగులగూడ అటవీ ప్రాంతంలో ఏనుగులు గత మూడు రోజులుగా తిష్టవేశాయి. నాలుగు ఏనుగులు ఒకేసారి ఘీంకారాలతో గిరిజనులు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు గ్రామాల వైపు పడతాయని ఆందోళన చెందుతున్నారు. కొండపోడుకు వెళ్లాలన్నా భయపడుతున్నారు. రోడ్డు పక్క నుంచీ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామ సమీపంలో ఉన్న అరటి పైనాపిల్ తోటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికే ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు ఏనుగుల కదలికలను ఆరా తీసి గిరిజనులను అప్రమత్తం చేస్తున్నారు. వెంటనే ఏనుగుల గుంపును తరలించాలని గిరిజనులు కోరుతున్నారు.

రేషన్ కార్డు లేదు.. పింఛను రాదు
ఎలా బతకాలి?

- **చనిపోవాలని ఉంది**
- **ఓ నిరుపేద వితంతువు ఆవేదన**

ప్రజాశక్తి-పార్వతీపురం

'కుటుంబానికి రేషన్ కార్డు లేదు. భర్త మరణించడంతో ఎలాంటి ఆధారమూ లేదు. ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని ఎలా పోషించాలి? చనిపోవాలని ఉంది' అని ఓ నిరుపేద వితంతు మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. మండలంలోని గంగాపురం పంచాయతీ తొక్కుడువలస కొత్తపాకలు గ్రామంలో కొండగొర్రి సంధ్య.. ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. సంధ్య భర్త రమేష్ ఏడాది క్రితం మరణించాడు. అప్పటి నుంచి కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా పోయింది. తనకు రేషన్ కార్డు, పింఛను మంజూరు చేయాలని ఆమె సచివాలయం చుట్టూ తిరుగుతోంది. ఏడాది కాలంగా తిరుగుతున్నా ఆమె గోడు సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మరణమే శరణమని చెపుతోంది. ఏ ఆధారమూ లేదని, పిల్లలను పెంచడం కష్టంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఒకవేళ తాను, తన పిల్లలు మరణిస్తే అధికారులే కారణమవుతారని ఆమె విడుదల చేసిన ఒక వీడియోలో పేర్కొంది.

చిన్న పిల్లలతో ఆవేదన వ్యక్తంచేస్తున్న సంధ్య

పాదయాత్ర చేపడుతున్న గిరిజన, ప్రజా సంఘాల నాయకులు, గిరిజనులు

గిరిజన గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

- **గిరిజన, ప్రజా సంఘాల నాయకులు**
- **'కొటియా'లో రెండో రోజు కొనసాగిన పాదయాత్ర**

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఆంధ్రా, ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని, కనీస మౌలిక సదుపాయాలు ఎక్కడా లేవని ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొటియా గ్రామాల్లో చేపట్టిన పాదయాత్ర రెండోరోజు ఆదివారం కొనసాగింది. సోలుపుగూడ, కందపాయి, కోనదారలో పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొటియా గ్రామాల్లో ఎక్కడా రోడ్లు, విద్యుత్తు, పాఠశాల భవనాలు వంటివి మచ్చుకైనా కనిపించలేదన్నారు. అసలు ఈ ప్రాంతం ఆంధ్రాకు సంబంధించిందా? అన్న అభిప్రాయం కలుగుతోందన్నారు. ఈ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఒడిశా అధికారులు అడ్డుకున్నా ఆంధ్రా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కొటియా గిరిజనులు ఒడిశాలో ఉండేందుకు మొగ్గు చూపడం లేదని, ఆంధ్రాలో ఉంటామని చెబుతున్నా.. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ప్రాంతంపై ఒడిశా అధికారులు చూపుతున్న శ్రద్ధలో కనీసం ఒక పది శాతమైనా ఆంధ్రా ప్రభుత్వం చూపితే ఇక్కడ చాలా అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. రెండు ప్రభుత్వాలు ఇక్కడ అభివృద్ధి చేసుకునే విధంగా సుప్రీంకోర్టు కూడా స్టేటస్‌కో విధించిందని, అవేమీ పట్టించుకోకుండా ఒడిశా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆంధ్రా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీశారు. కొటియా ప్రాంతంపై ఇదేవిధంగా ఆంధ్రా ప్రభుత్వ ధోరణి కొనసాగిస్తే, గిరిజనులను ఐక్యం చేసి, పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు, ఎన్‌వై నాయుడు, తాడంగి సన్నం, చరణ్, సీతయ్య, బిరుసు, పూలు, చుక్కయ్య, సామి, రాజు, బాబయ్య తదితరులు పాల్గొన్నారు

ఇదిగో జాగా..
వేసేయ్ పాగా

మున్సిపాలిటీలో ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేసేయ్ అన్న చందంగా తెలుగు తమ్ముళ్ల దందా కొనసాగుతోంది. ప్రధాన జంక్షన్లలో స్థలాలపై దృష్టి సారించడం, రాత్రికి రాత్రే అక్కడ షాపులకు లైసెన్స్ ఇచ్చేయడం ఇష్టారాజ్యంగా సాగుతోంది. అనధికార షాపుల యజమానుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది నెలలుగా ఈ బాగోతం సాగుతున్నా పట్టణ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొంతమంది మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే స్థితిలో వారు లేరు. మంత్రి సంధ్యారాణి పేరు చెప్పుకుని ఆమెకి సన్నిహితులైన కొందరు పట్టణ నాయకులు ఈ దందాకు తెరలేపారనే ప్రచారం సాగుతోంది. పట్టణంలో ఆక్రమణలను ఓసారి పరిశీలిస్తే...

- **మున్సిపాలిటీలో తెలుగు తమ్ముళ్ల దందా**
- **మంత్రి అండతో 'అనధికార' షాపులకు లైసెన్సులు!**
- **చోద్యం చూస్తోన్న టౌన్ ప్లానింగ్ అధికారులు**

పెద్ద బజార్ పక్కన ఉన్న పాత బస్టాండ్ స్థలంలో వెలిసిన అనధికార షాపు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని పెద్ద బజార్ పక్కన ఉన్న పాత బస్టాండ్ స్థలంలో పట్టణానికి చెందిన ఓ ముఖ్య నాయకుడు ఒక అనధికార షాపునకు 'లైసెన్స్' ఇచ్చేయడంతో అక్కడ రాత్రికి రాత్రే ఓ కోడిగుడ్ల వ్యాపారి షాపు నిర్మించేశాడు. ఈ ప్రదేశంలో ఉన్న సెలూన్ షాపులకు ఎదురుగా అనధికార షాపు ఏర్పాటు చేయడంతో వారంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నాయీ బ్రాహ్మణులకు చెందిన సెలూన్ షాపులకు ఎదురుగా అనధికార షాపు ఏర్పాటు చేయడంతో తమ వ్యాపారాలు దెబ్బ తింటాయని ఆవేదన చెందుతున్నారు. గత ఎన్నికల్లో టిడిపికి మద్దతుగా నిలిచినందుకు ఆ పార్టీ నాయకులు తగిన బహుమానం ఇచ్చారని వారు అంతర్మథనం చెందుతున్నారు.

- ☞ మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళే దారిలో కాలువపై కొత్తగా ఓ దుకాణానికి కూడా టిడిపి పట్టణ నాయకుడు 'అనుమతి' జారీ చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి.
- ☞ ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న చేపల దుకాణాల పక్కన కూడా ఓ దుకాణం వెలిసింది. ఆ దుకాణం లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రికి ఎదురుగా ఉండటంతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం చర్చనీయాంశమవుతోంది.
- ☞ పట్టణంలోని లెప్రసీ ఆస్పత్రి ముందు చెరుకుపల్లి గెడ్డ కాలువపైనా ఓ అనధికార షాపు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నారు. పట్టణంలోని పేరసాగరం చెరువుకు చెరుకుపల్లి గెడ్డ కాలువ ద్వారా వర్షపు నీరు చేరుతుంది. ఇప్పటికే ఈ చెరుకుపల్లి గెడ్డ కాలువ ఆక్రమణకు గురి కావడంతో భారీ వర్షాలు పడినప్పుడల్లా వరదనీరు జాతీయ రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతంలో ఉన్న రామా కాలనీ, అఫీషియల్ కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కాలువపై కొత్తగా షాపులు ఏర్పాటు చేయడం వల్ల ముంపు ప్రమాదం పొంచి ఉంది.
- ☞ వెంగళరాయసాగర్ క్వార్టర్స్‌కి ఎదురుగా ఉన్న స్థలాల్లోనూ అనధికార షాపులకు లైసెన్స్‌లు ఇస్తున్నా అటు మున్సిపల్ అధికారులు గాని, ఇటు విఆర్‌ఎస్ అధికారులు గాని పట్టించుకోవడం లేదు.
- ☞ జైపూర్ రోడ్డులో జాతీయ రహదారి పక్కన కెవిఆర్ ఎస్టేట్ ముఖద్వారం వద్ద కూడా అనధికార షాపు ఏర్పాటుకు అనుమతి ఇచ్చారనే ప్రచారం సాగుతోంది.

అడ్డు చెప్పేది ఎవరు?

పట్టణంలోని ప్రముఖ జంక్షన్లలో ఉన్న మున్సిపల్ స్థలాల్లో యథేచ్ఛగా అనధికార షాపులకు లైసెన్స్‌లు ఇచ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి సంధ్యారాణి అండదండలు పుష్కలంగా ఉన్నాయనే భయంతో అధికారులు తెలుగు తమ్ముళ్లకు అడ్డు చెప్పడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. ఏమైనా మున్సిపాలిటీ పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అనధికార షాపులకు లైసెన్స్‌లు ఇవ్వడం, షాపు యజమానుల నుంచి వసూళ్లు చేయడం వంటి పరిణామాలు పట్టణ ప్రజల్లో సరికొత్త చర్చకు తెరలేపాయని చెప్పొచ్చు.

కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ డుమ్మా

- హాజరైన డైరెక్టర్లపై అసంతృప్తి
- సంఘం నాయకులు గరంగరం

ప్రజాశక్తి-పార్వతీపురం

కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ ఆదివారం సాయంత్రం నిర్దేశించిన ఆ సామాజిక తరగతి సంక్షేమ సంఘం సమావేశానికి డుమ్మా కొట్టారు. చైర్మన్ పివిజి కుమార్ సహా డైరెక్టర్లు హాజరవుతారని పట్టణంలోని సిఎస్ఎన్ కళ్యాణమండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. డైరెక్టర్లు గొట్టాపు వెంకట నాయుడు, మధుసూదనరావు, అప్పలనాయుడు హాజరయ్యారు. కానీ చైర్మన్ కుమార్ రాకపోవడంతో ఆ సంఘం నాయకులు, ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చైర్మన్ కుమార్ గైర్హాజరు కావడం వెనుక స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది. వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎలా హాజరవుతారని ఎమ్మెల్యే బోనెల.. చైర్మన్ కుమార్‌ని ప్రశ్నించడంతో ఆయన గజపతినగరం వరకు వచ్చి వెనుదిరిగినట్లు తెలిసింది. జిల్లా పర్యటనకు వస్తున్నారని ముందస్తు సమాచారం ఉండడంతో కొప్పల వెలమ సంక్షేమ సంఘం నాయకులు సభ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. తీరా సంఘం సమావేశానికి రాజకీయ రంగు పులిమి చైర్మన్‌ని రాకుండా చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కురుపాంలో నారు పోస్తున్న రైతు

ముమ్మరంగా నారుపోత

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఆదివారం మండల కేంద్రమైన కురుపాంతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో రైతన్నల ముమ్మరంగా నారుపోత పనులు చేపట్టారు. రానున్న కాలంలో నారు బాగా పెరగాలంటే అప్పుడప్పుడు వర్షాలు పడాలని రైతులు చెబుతున్నారు.

రోడ్డు, కాలువ లేని రెల్లి వీధి

ఆ వీధి వాసులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి-మక్కువ

మక్కువలోని రెల్లివీధిలో కాలువ, సిసి రోడ్ లేకపోవడంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. స్థానిక జూనియర్ కాలేజీ సమీపంలో ఉన్న ఈ కాలనీలోని ఓ వీధికి కాలువ నిర్మాణం లేక మురుగు నీటిపైనే నడవాల్సి వస్తుందని వారంతా వాపోతున్నారు. రహదారి సౌకర్యం కూడా లేదని, మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిమెంటు రహదారితో పాటు కాలువ నిర్మాణం చేపట్టాలని రెల్లివీధి వాసులు కోరుతున్నారు.

ట్రోఫీ అందజేస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

క్రికెట్ టోర్నీ విజేత వెంకంపేట

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దేవనాపురంలో నెల రోజులపైగా జరిగిన నాలుగో ప్రీమియర్ లీగ్‌లో పాలకొండ పట్టణంలోని వెంకంపేట వీధి జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో 97 జట్లు పాల్గొన్నాయి. సీతంపేట మండలం కిల్లాడ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఎస్ఐ వై.అమ్మన్నరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.సూరిబాబు, బి.జగన్, నాయకులు కె.కామయ్య, వి.మురళి, ఎం.రవికుమార్, ఎం.శ్యామ్, సుందర్రావు, పాలక పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

డాక్-2025 సదస్సుకు సెంచూరియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో జరగుతున్న 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ (డాక్) సదస్సుకు భారత్ నుంచి సెంచూరియన్ విశ్వవిద్యాలయం తరపున ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్‌దాస్, లక్ష్మీకాంత్ సుతార్ పాల్గొంటున్నారు. ఈ నెల 22 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో చిప్స్‌టు సిస్టమ్స్ అనే అంశంపై ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సీమెన్స్, చిప్ ఏజంట్స్ ఏ1, సినాప్సిస్, కీసైట్, ఎన్సిస్, కాడెన్స్, రాకెట్ సాఫ్ట్ వేర్ వంటి దిగ్గజాలు తమ తాజా ఆవిష్కరణలను ప్రదర్శించనున్నాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి.ఎన్.రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై మన సామర్థ్యాలను పరిచయం చేయడానికి భారత్ నుండి ప్రథమ విశ్వవిద్యాలయంగా నిలిచినందుకు గర్విస్తున్నామన్నారు. ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా మన పరిశోధన, ఆవిష్కరణల పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తున్నామన్నారు. సెంచూరియన్ యూనివర్శిటీ పరిశ్రమలతో సంబంధాన్ని బలోపేతం చేసేందుకు ప్రముఖ సెమికండక్టర్ డిజైన్ సంస్థ మార్కీసెమికండక్టర్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకుందన్నారు. ఈ సహకారం ద్వారా విద్యార్థులకు ఆధునిక టూల్స్ మీద అనుభవం కల్పించడంతో పాటు, సెమికండక్టర్ టెక్నాలజీలో శిక్షణను మరింత బలోపేతం చేయనుందన్నారు.

పది నెలలకే పెచ్చులూడిన రహదారి

- నాణ్యతా ప్రమాణాలు కరువు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- కోట్లాది రూపాయలు బుగ్గిపాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎన్నో ఏళ్లుగా ప్రధాన రహదారి ఇరుగ్గా ఉండటంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గతంలో సీతంపేట ఐటిడిఎ పిఒగా పనిచేసిన సిహెచ్ శ్రీధర్ పుణ్యమా! అని వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణకు మోక్షం కలిగింది. పది కాలాల పాటు ఉండాల్సిన ప్రధాన రహదారి పుటుక్కుమని పది నెలలకే పెచ్చులూడిందంటే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో? అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో? వీటిని చూస్తేనే అర్థం చేసుకోవచ్చు.

మండల కేంద్రమైన వీరఘట్టంలోని వట్టిగెడ్డ వంతెన నుంచి స్వామి థియేటర్ వరకు సుమారు 1.2 కిలోమీటర్ల పరిధిలో ఉపాధి హామీ నిధుల ద్వారా రూ.5.5 కోట్లతో ఐటిడిఎ పర్యవేక్షణలో ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు చేపట్టారు. అధికారులు పర్యవేక్షణ కొరవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేసి మమా అనిపించారు. ప్రధాన రహదారికి మధ్యలో సిమెంట్‌తో డివైడర్లు ఏర్పాటు చేశారు. అందులోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. అవి ఎక్కడికక్కడే పెచ్చులూడి దర్శనమిస్తున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు చేపట్టినప్పటికీ ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం వల్ల డివైడర్లు, రోడ్డు ఈ స్థితికి చేరుకున్నాయని, ప్రజాధనం బుగ్గిపాలైందని స్థానికులు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. డివైడర్లకు ఏ విధమైన ఆనవాళు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రస్తుతం రహదారికి మధ్యలో ఉన్న డివైడర్లు ఇటుక అచ్చులు వేసిన మాదిరిగా ఉన్నాయి. వాహనాలు వీటిని గుద్దిన వెంటనే ఊడిపోతున్నాయి. దీన్నిబట్టి డివైడర్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాంట్రాక్టర్లు ఇచ్చే కాసులకు అధికారులు కక్కుర్తిపడటం వల్ల ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు ఇలా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

శిథిలమైన డివైడర్

కాలువపై వేయని పలకలు



హనుమాన్ జంక్షన్ వద్ద పెచ్చులూడిపోయిన రోడ్డు

అర్థం కాని స్థితిలో కాలువలు నిర్మాణం

ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించారు. అయితే తెలగ వీధి జంక్షన్ నుంచి వట్టిగెడ్డ వంతెన వరకు మురుగునీరు వెళ్లేందుకు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఇదే తెలగవీధి జంక్షన్ నుంచి స్వామి థియేటర్ వరకు కాలువ నిర్మించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి మిత్ర జంక్షన్ వరకు మరోవైపు కాలువ నిర్మించి మురుగునీటిని పాత బస్టాండ్ వైపు మళ్లించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు కాలువ నిర్మించి నీరంతా కోనేటి చెరువులోకి మళ్లించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నేరుగా పాలగెడ్డలోకి కాలువ నిర్మించారు. హనుమాన్ ఆలయం వైపు ఉన్న కాలువ నేరుగా స్వామి థియేటర్ దాటించి కాలువ పనులు చేపట్టినప్పటికీ మురుగు నీరు వెళ్లేందుకు మార్గం చూపించలేదు. దీంతో నీరంతా నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద నిర్మించిన కాలువ గౌడువీధి వైపుగా నీరు వెళ్లేందుకు ప్రణాళికలు అధికారులు రచించారు. వీరి ఆలోచనకు అర్థం లేకుండా పోయిందని, చిన్నపాటి వర్షం కురిసినా వరద చిన్న కాలువలోకి వెళ్లేందుకు ఆస్కారం లేకపోవడంతో ఆ నీరంతా రహదారిపై ప్రవహించడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలకలే లేవు

ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించి, వాటిపై పలకలు ఏర్పాటు చేయాలి. జనవీధి జంక్షన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్, మిత్ర జంక్షన్, స్వామి థియేటర్ ప్రాంతాల్లో కాలువలపై పలకలు ఏర్పాటు చేయలేదు. దీనివల్ల ఆయా జంక్షన్ల వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులకు, తిరుగుతున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవడం వల్ల దుర్గంధం వేద చల్లడంతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి ప్రధాన రహదారి విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయమై స్థానిక ఆర్అండ్‌బి జెఇ కిరణ్ కుమార్ వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా కాంట్రాక్టర్లతో మాట్లాడి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

భవనం సరే.. పిల్లలు ఏరి?

నిరుపయోగంగా ఉన్న బాలికల సమీకృత భవనం

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద బాలికల సమీకృత భవన నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో సుమారు రూ.రెండు కోట్ల అంచనా వ్యయంతో అప్పట్లో భవనం పనులు ప్రారంభించి, సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పట్లో కాంట్రాక్టరు అర్థాంతరంగా పనులు నిలిపివేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెండింగ్ పనులు పూర్తి కాలేదు. బిల్లులు కూడా చెల్లించలేదు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టరు చకచకా పనులు చేపట్టారు. అన్ని హంగులతో భవనం పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కోట్లాది రూపాయలు వెచ్చించి భవనం పనులు చేపట్టినప్పటికీ పిల్లలు లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి, వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

స్టిక్కర్లు విడుదల చేస్తున్న నాయకులు

సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మక్కువ

జులై 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు కోరారు. ఆదివారం మక్కువలో సార్వత్రిక సమ్మె ప్రచార స్టిక్కర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై పని భారం పెంచేలా నిర్ణయాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. అందులో భాగంగానే పని గంటలను 12 గంటలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు తెస్తుందని మండిపడ్డారు. దేశంలో కార్మిక వర్గానికి నష్టం చేసేలా కేంద్రం లేబర్ కోడ్లను తెస్తోందని విమర్శించారు. దీనిపై ఇప్పటికే పెద్దఎత్తున పోరాటాలు కూడా చేశామని గుర్తు చేశారు. కోట్లాదిమంది కార్మిక వర్గానికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు కాని పరిస్థితి ఉందన్నారు. వీటిపై దృష్టి పెట్టని పాలకవర్గాలు కార్మికులపై దాడులు పెంచి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మిక శ్రేయస్సు కోసం పనిచేస్తామని చెప్పి అధికారం చేపట్టాక పెట్టుబడిదారీ వర్గానికి సేవ చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కార్మిక వర్గానికి నష్టం చేసే విధానాలు నిలిపివేయాలని డిమాండ్‌చేశారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలన్నారు. వాటికోసం కార్మిక సంఘాలు ఐక్యమై భవిష్యత్తులో పోరాటాలు ముందుకు తీసుకువెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎల్.దాలమ్మ, మరిపి రూపావతి, బొత్స సూర్యనారాయణ, ఎన్.కళ్యాణి, ఎల్.లక్ష్మి, ఎల్.పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నిర్లక్ష్యంతోనే సాగునీటి కష్టాలు

ఎమ్మెల్యే జయకృష్ణ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రజాశక్తి-వీరఘట్టం

వైసిపి హయాంలో తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనులు గాలికి వదిలేశారని, దీంతో రైతులను సాగునీటి కష్టాలు వెంటాడాయని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని నీలానగరం - పాలమెట్ట గ్రామాల మధ్య రూ.11 లక్షలతో మరమ్మతులు చేపట్టిన ఓపెన్ హెడ్ ఛానల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 8 గ్రామాల్లో సుమారు 2200 ఎకరాలకు సాగునీరు అందించనున్నామని తెలిపారు. ఈ ప్రాంత రైతుల కోసం యుద్ధ ప్రాతిపదికన కాలువ పనులు చేపట్టినట్లు తెలిపారు. పాలమెట్ట ఓపెన్ హెడ్ ఛానల్ నుంచి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలంటే గతంలో రైతుల నుంచి డబ్బులు వసూలు చేసే వారని గుర్తుచేశారు. ఆ విధానానికి స్వస్తి పలుకుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తుందన్నారు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణకు రూ.197 కోట్లతో 17 శాతం అభివృద్ధి పనులు చేశామన్నారు. వైకాపా హయాంలో పదవులు పొందిన వారు అప్పుడు మాట్లాడకుండా ఇప్పుడు తనపై విమర్శలు చేస్తున్నారంటూ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ పొదిలాపు విజయ రమణి, కృష్ణమూర్తి నాయుడు, సుడా చైర్మన్ కె.రవికుమార్, కూటమి నాయకులు కర్నేని అప్పలనాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్ళా హరిబాబు, గర్భాన సత్తిబాబు, మాచర్ల అనిల్, చింత ఉమామహేశ్వరరావు, ఎ.కుమారస్వామి, ఎ.కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

కేకు కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్

ఘనంగా ద్వారపురెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పార్వతీపురం

మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. జగదీష్‌ను టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన బర్త్‌డే కేక్ కట్ చేశారు. టిడిపి సీతానగరం మండల మాజీ అధ్యక్షులు కొల్లి తిరుపతి రావు, సీనియర్ నాయకులు చుక్క జయప్రకాష్, మరిశర్ల కార్తీక్ నాయుడు, బొత్స వెంకట నాయుడు, రెడ్డి భీమశంకరరావు.. ద్వారపురెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

తెగులు నిర్ధారించాకే మందులు వాడాలి

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి-పాచిపెంట

రైతులు పంటలకు ఆశించిన తెగుళ్లను నిర్ధారణ చేసుకున్న తరువాతే సరైన మందులను పిచికారీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు సూచించారు. ఆదివారం మండలంలోని పాంచాలి గ్రామంలో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ప్రస్తుతం పత్తి పంటకు ఎలాంటి తెగుళు లేవని, మబ్బు వాతావరణంలో రసం పీల్చు పురుగులు ఆశించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. రైతులు ముందుగా పొటాష్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లను సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా నిర్ధారించుకొని తదుపరి మాత్రమే మందుల పిచికారీకి వెళ్లాలని చెప్పారు. మొక్కజొన్న పంటలో ప్రస్తుతం కత్తెర పురుగు ఆశించిందని తెలిపారు. దీని నివారణకు నేరుగా ఖరీదైన రసాయన పురుగు మందులను వాడకుండా వేప మందు, వేప కషాయం, నీమాస్త్రం వంటి మందులతో లేదా క్లోరిపైరిఫాస్ వంటి తక్కువ ఖర్చుతో కూడుకున్న ప్రభావవంతంగా పనిచేసే మందులను మాత్రమే పిచికారి చేసుకోవాలని కోరారు. విచక్షణా రహితంగా వాడితే పురుగులు, తెగుళ్ల తగ్గకపోవడమే కాకుండా పర్యావరణానికి నష్టం కలిగి జీవ వైవిధ్యం నశించి కొత్త రకాలైన పురుగులు, తెగుళ్ల ఆశించే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈదుబిల్లి శ్రీను, ఎల్‌వన్ తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాలకొండ

వైసిపి యువజన విభాగం ఆధ్వర్యాన సోమవారం చేపట్టే యువత పోరు పోస్టర్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆవిష్కరించారు. ఆదివారం ఆ పార్టీ యువజన విభాగం నాయకులు, నిరుద్యోగులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. సోమవారం జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి యువత తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, మండల అధ్యక్షులు అల్లు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కుసిమిగూడ సమీపంలో మల్లమ్మకొండపై 600 లీటర్ల బెల్లంఊటను ఎస్ఐ అమ్మనరావు ఆధ్వర్యంలో ఆదివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సారా తయారీ కేంద్రాలపై దాడులు తప్పవని హెచ్చరించారు. సారా విక్రయించినా, తయారీ, రవాణా చేసినా కేసులు తప్పవని హెచ్చరించారు.

విలేకరులు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
గరివిడి, బాడంగి, కొత్తవలస రూరల్, జియ్యమ్మవలస
సాలూరు, పార్వతీపురం రూరల్, బలిజిపేట రూరల్
ఇంటర్వ్యూ : తేది: 04-07-2025 శుక్రవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నంబరు :
9490099164, 9490099156, 8331011960
ప్రజాశక్తి కార్యాలయం
అశోక్ బంగ్లా ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం